





రూ.9.40 కోట్లతో కోరుకొండ అభివృద్ధి

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- కోరుకొండలో గడప గడపకూ మన ప్రభుత్వం



కోరుకొండలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: మండల కేంద్రమైన కోరుకొండ అభివృద్ధికి రూ.9.40 కోట్లు కేటాయించినట్టు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తెలిపారు. ఆదివారం కోరుకొండలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గడప గడపకూ తిరుగుతూ సంక్షేమ పథకాలందుతున్న తీరును ఆరా తీశారు. స్థానికులు ఆయనకు స్వాగతం పలికారు. ఆడపడుచులు హారతులు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ దళారుల ప్రమేయం లేకుండా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వమిదే అన్నారు. మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లా భావించి హామీలన్నింటినీ అమలు జరిపింది జగనన్న ప్రభుత్వమే అన్నారు. పేదవర్గాలకు నవరత్నాలు ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. వలంటరీ, సచివాలయం వ్యవస్థ ద్వారా పేదవర్గాలకు మేలు జరుగుతోందన్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు, పరిపాలన వ్యవస్థను ప్రజల వద్దకే తీసుకొచ్చిన నాయకుడు జగనన్నే అన్నారు. గత ప్రభుత్వంలో కోరుకొండ అభివృద్ధికి కేవలం రూ.1.62 కోట్లు మాత్రమే కేటాయిస్తే, జగనన్న ప్రభుత్వంలో రూ.9.40 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. కులాలు, మతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వమిదే అన్నారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 8–30 గంటల వరకూ గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, పార్టీ జిల్లా నాయకులు కేతినీడి అశోక్, నాయకులు పసుపులేటి బుల్లియ్యానాయుడు, వక్ఫ్ బోర్డు జిల్లా డైరెక్టర్ షేక్ బీజిలాని, బొరుసు బద్రి, వాకా నరసింహరావు, దాసరి యేసు, ముసరుమెల్లి రాము, పి.శిరీష, బి.హరిప్రియ పాల్గొన్నారు.

సారా నిర్మూలనకు చర్యలు

మధురపూడి: గ్రామాల్లో నాటు సారాను నిర్మూలించాలన్న లక్ష్యంతో సెబ్ చర్యలు చేపట్టిందని, దానిలో భాగంగా 2023 సంవత్సరంలో 335 మంది ముద్దాయిలపై 268 కేసులు నమోదు చేసినట్టు సెబ్ కోరుకొండ సీఐ జి. సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కోరుకొండ సర్కిల్ పరిధిలో కోరుకొండ, సీతానగరం, గోకవరం మండలాల్లో నిత్యం దాడులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దానిలో భాగంగా సారా అమ్మకాలు, రవాణాకు ఉపయోగించిన 25 వాహనాలను, 2,511 లీటర్లు నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. 28,000 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు తెలిపారు. సారా తయారీకి వినియోగిస్తున్న 5,638 కేజీల నల్ల బెల్లాన్ని స్వాధీనం చేసుకుని, దీన్ని విక్రయించిన వ్యాపారస్తులను అరెస్టు చేసినట్టు తెలిపారు.









వైభవంగా కనకదుర్గమ్మ తీర్థం

వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలో నిలుచున్న భక్తులు



సూర్యారావుపేటలో కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే రాజా

రాజానగరం: జాతీయ రహదారిని ఆనుకుని సూర్యారావుపేట జంక్షన్ వద్ద కొలువైవున్న కనకదుర్గ అమ్మవారి తీర్థమహోత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. సూర్యారావుపేట, చక్రద్వారబంధం గ్రామస్తుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఉత్సవాలకు పరిసర గ్రామాల నుంచి కూడా భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓ మోస్తరుగా ఉన్న భక్తుల రద్దీ రాత్రి సమయంలో అధికమైంది. పక్కనే ఉన్న కాకినాడ జిల్లా, గండేపల్లి మండలం, మురారిలో ఉదయం నుంచి సాయంత్రం వరకు కనకదుర్గ అమ్మ వారి తీర్థమహోత్సవాలు ఘనంగా జరుగుతాయి. అక్కడ నుంచి సాయంత్రం దాటాక ఆ ప్రాంతాలలోని భక్తులు సూర్యారావుపేటకు వచ్చి అమ్మవారిని దర్శించుకోవడం పరిపాటి. దీనితో పగటి సమయంలో కంటే రాత్రి సమయంలోనే ఇక్కడ భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని నిర్వాహకులు, పోలీసుల సహకారంతో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. గ్రామంలోకి వాహనాలను అనుమతించకుండా రూటు మళ్లించారు. జాతీయ రహదారిపై కూడా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. రాజానగరం, బొమ్మూరు పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఈ సమయంలో వచ్చే భక్తులను అలరిస్తూ, హుషారు గొలిపే విధంగా ఆలయ పరిసరాలలో నిర్వాహకులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

అమ్మ వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. అనంతరం భక్తులతో కొద్దిసేపు ముచ్చటించి, మధ్యాహ్నం నిర్వహించిన అన్న సమారాధనలో పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. తొలుత నిర్వాహకులు ఎమ్మెల్యేకి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

గైట్ కళాశాల ప్రాంగణాన్ని పరిశీలించిన డీఎస్పీలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీలు

రాజానగరం: వచ్చే నెల 5 నుంచి అంతర్జాతీయ తెలుగు మహాసభలు జరిగే గైట్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణాన్ని, నిర్వాహణా పరమైన ఏర్పాట్లను రాజమహేంద్రవరం డీఎస్పీ ఎం.కిషోర్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ రామవర్మ ఆదివారం పరిశీలించారు. చైతన్య విద్యాసంస్థలు, ఆంధ్ర సార్వస్వత పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరుగనున్నాయి. 4వ తేదీ నుంచి చతుర్వేద మహాయాగం, శ్రీవారి వైభోగోత్సవాలు కూడా జరుగనున్నాయి. వీటికి రావలసిందిగా ఐదు రాష్ట్రాలకు చెందిన గవర్నర్లు, కొందరు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, పీఠాధిపతులకు ఆహ్వానాలు వెళ్లిన నేపథ్యంలో డీఎస్పీలు భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం చైతన్య విద్యసంస్థల చైర్మన్ కేవీవీ సత్యనారాయణ రాజుతో కొద్దిసేపు సమావేశమయ్యారు.

కళావాచస్పతి జగ్గయ్య జయంతి



బూరుగుపూడిలో జగ్గయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అభిమానులు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడిలో కళావాచస్పతి జగ్గయ్య జయంతి ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది మర్తిపాటి శేషగిరిరావు మాట్లాడుతూ జగ్గయ్య కథానాయకుడు, ఉప నాయకుడుగా సినిమాల్లో నటించి ప్రేక్షకుల మన్నలను పొందారన్నారు. తొలుత జగ్గయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. పలు సినిమాల్లో ఆయన నటన అద్వితీయం అన్నారు. కార్యక్రమంలో సినీ విశ్లేషకులు అడబాల మరిడయ్య, జగ్గయ్య అభిమానులు సూర్యనారాయణ, సోమరాజు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక మంగళవారపుపేటలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బోగిరెడ్డి శ్రీనివాస్‌ను ఆదివారం అరెస్టు చేశామని ఎస్ఈబీ నార్త్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. అతని వద్ద నుంచి 650ఎంఎల్ ఆరు బీరు బాటిల్స్, 180ఎంఎల్ ఐదు మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.





60 మందికి గుండె వైద్య పరీక్షలు

ఉండ్రాజవరం: దమ్మెన్ను గ్రామంలో ప్రాథమిక పాఠశాల వద్ద ఆదివారం సర్పంచ్ గుర్లజర్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో విజయవాడ డాక్టర్ వైవీ రావు ఉషా కార్డియాక్ సెంటర్ నుంచి వచ్చిన వైద్యులు సుమారు 60 మందికి గుండె స్కానింగ్, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించారు. వారిలో 7 మందికి ఆపరేషన్లు నిమిత్తం రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉషా కార్డియాక్ సిబ్బంది పాల్గొన్నారు.

కాపులను బాబుకు అమ్మేయాలని చూస్తున్న పవన్

రాజమహేంద్రవరం రూరల్: కాపులను కట్టకట్టి చంద్రబాబుకు అమ్మేయాలని చూస్తున్న పవన్‌కళ్యాణ్ కావాలా? మనకు అండగా నిలుస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలా? అన్నది కాపు సోదరులంతా విజ్ఞతతో ఆలోచించాలని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్, రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు ముద్దాల తిరుపతిరావు(అను) ఓ ప్రకటనలో తెలిపారు. కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం చేసిన కాపు ఉద్యమంలో కాపుల కష్టకాలంలో కాపు కులస్తులకు అండగా నిలబడిన నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆరోజు తెలుగుదేశం ప్రభుత్వంలో కాపు యువతను పోలీస్ స్టేషన్లో పెట్టి కాపు హింసించిన రోజులు మరిచిపోయారా అని ప్రశ్నించారు.

ఎంపీ సార్.. నాకు పునర్జన్మ ఇచ్చారు

జీవితాంతం రుణపడి ఉంటా

రాజమహేంద్రవరం రూరల్: నగరంలోని 25వ డివిజన్ మంగళవారపు పేట, ఆకుల వారి వీధికి చెందిన టీడీపీ కార్యకర్త పూతి సంతోషిమాత గుండె సంబంధిత సమస్యతో తీవ్ర అనారోగ్యానికి గురైంది. రాజమహేంద్రవరంలో వైద్యులు ఈమె ఆరోగ్యాన్ని పరీక్షించి ఆపరేషన్ చేయాలంటే రూ.6 లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. అసలే అనారోగ్యంతో బెంగపెట్టుకుని కుమిలిపోతున్న ఆమెకు రూ.6 లక్షలనగానే దిగాలు పడిపోయింది. ఆమె ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రం. సంతోషి మాత భర్త అప్పలరెడ్డి ఆటో డ్రైవర్. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు. రోజు గడపడమే భారం. దానికి తోడు ఇన్ని లక్షలు ఎక్కడ్నించి తేవాలి?.. ఎవరిస్తారు?, ఇచ్చినా తిరిగి ఎలా చెల్లించాలి?..అనుకుంటూ ఆమె సతమవుతున్న సమయంలో తనకు తెలుసున్న మార్గాని సుశీలను కలిసి తన ఆవేదన వ్యక్తం చేసింది. మానవత్వంతో స్పందించిన సుశీల తక్షణం ఎంపీ భరత్‌ను కలిసి.. తన మిత్రురాలి ఆరోగ్య పరిస్థితి వివరించి సహాయాన్ని కోరింది. ఎంపీ భరత్ స్పందించారు. వైద్యుల నివేదికలను పరిశీలించి, ఆమె వైద్యానికి ప్రభుత్వపరంగా ప్రయత్నిస్తా..లేదంటే నేనైనా ఆర్థికంగా సహకరించి ఆదుకుంటానని ధైర్యాన్ని ఇచ్చారు. సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.4.5 లక్షలు మంజూరయ్యాయి. ఎంపీ భరత్ హైదరాబాదులో వైద్యులతో మాట్లాడి, ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఆమెకు గుండెకు సంబంధించి ఆపరేషన్ చేయించారు. ఆమె కోలుకుంది. ఇప్పుడు పూర్తి ఆరోగ్యవంతురాలైంది. తనకు పునర్జన్మ ప్రసాదించిన ఎంపీ భరత్‌కు కృతజ్ఞతలు తెలిపేందుకు సంతోషిమాత నగరంలోని వీఎల్ పురంలో గల ఎంపీ కార్యాలయానికి మార్గాని సుశీల సహాయంతో వచ్చింది. ఆమెను ఎంపీ భరత్ ఆప్యాయంగా పలకరించారు. ఈ సమయంలో ఆమెకు కన్నీళ్ళు ఉబికి వచ్చాయి. మీరు ఆదుకోకుంటే నేను బతికి ఉండేదానిని కాను..నాకు పునర్జన్మ ఇచ్చారు..మీకు ఎంతో రుణపడి ఉన్నానంటూ ఉద్వేగంతో చెప్పింది. అనంతరం మీడియాతో ఆమె మాట్లాడుతూ సీఎం జగనన్నకు, ఎంపీ భరత్ అన్నకు రుణపడి ఉంటానంటూ కృతజ్ఞతలు తెలిపింది. సంతోషిమాత స్నేహితురాలు సుశీల కూడా ఎంపీ భరత్ కు కృతజ్ఞతలు తెలిపారు.


ఎంపీ భరత్‌రామ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న సంతోషిమాత


అమృత్‌భారత్‌కు స్వాగతం పలుకుతున్న ఎంపీ భరత్‌రామ్, చిత్రంలో రుడా చైర్మన్ రౌతు

సామాన్యులకు అందుబాటులో స్పీడ్ రైళ్లు

కేంద్ర ప్రభుత్వం సామాన్యులకు సైతం వేగవంతమైన రైళ్లను అందుబాటులో తీసుకు రావడం అభినందించదగ్గ విషయమని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. ఆదివారం రాత్రి విశాఖపట్నం మీదుగా విజయవాడ వెళుతున్న అమృత్ భారత్ రైలుకు రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్లో ఎంపీ భరత్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున విద్యార్థులు, నగరవాసులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, రైల్వే అధికారులు స్వాగతం పలికారు. ఈ రైలును డిసెంబర్ 30న మాల్దా టౌన్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. అమృత్ భారత్ రైలు రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్లో ఆగగానే జై భారత్, జై శ్రీరామ్ నినాదాలతో రైల్వేస్టేషన్ మార్మోగిపోయింది. ఈ రైలుకు విద్యార్థులు జాతీయ పతాకాలతో స్వాగతం పలికారు. ఎంపీ భరత్ రైలు బోగీలను పరిశీలించారు. ఆ రైలులో ప్రయాణికులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఎంపీ మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ముఖ్యంగా ప్రధాని మోదీ, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కృషి సామాన్యమైనది కాదన్నారు. అన్ని వర్గాల ప్రజలూ సుఖంగా, వ్యయ భారం లేకుండా ప్రయాణించాలనే ఉద్దేశంతో స్పీడ్ రైళ్లను ఒకటొకటిగా తీసుకు రావడం సంతోషంగా ఉందన్నారు. కొత్తగా ప్రవేశ పెట్టిన అమృత్ భారత్ ట్రైన్‌లో 12 స్లీపర్ క్లాస్, 8 జనరల్, రెండు గార్డు బోగీలు ఉంటాయని తెలిపారు. గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుందన్నారు. పలు రైల్వే స్టేషన్లో ఈ రైలు ఆగడం వల్ల అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటుందనే ఆశాభావాన్ని ఎంపీ భరత్ వ్యక్తం చేశారు.

రాజమహేంద్రవరం రైల్వే స్టేషను అభివృద్ధికి రూ.300 కోట్లు

రాజమహేంద్రవరం రైల్వే స్టేషను అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.300 కోట్లు మంజూరు చేసిందని ఎంపీ భరత్ తెలిపారు. ప్రస్తుతం ఉన్న రైల్వే స్టేషను సమీపంలోని అయిదు బళ్ళ మార్కెట్ వద్దకు తరలిపోనుందని చెప్పారు. విశాఖ- విజయవాడ మధ్య 3, 4 లైన్లు పెరుగుతున్న సందర్భంగా రాజమండ్రి, కోస్తా ప్రాంతాలకు మహర్దశ కలగబోతోందని చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని హైస్పీడ్ రైళ్లు రానున్న కారణంగా అందుకు తగ్గట్టు రాజమహేంద్రవరంలో గోదావరి నదిపై మరో కొత్త వంతెన అవసరం చాలా ఉందన్నారు. ఈ విషయాన్ని పార్లమెంటులోను, రైల్వే శాఖ మంత్రికి, కేంద్ర ప్రభుత్వానికి వివరించినట్టు తెలిపారు. త్వరలోనే ఆ కొత్త వంతెనకు కూడా శంకుస్థాపన చేసే అవకాశం ఉందన్నారు. రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, రైల్వేస్టేషన్ ఎస్ఎం రంగనాథ్, ఆర్‌పీఎఫ్ సీఐ టి.సైదయ్య, సీటీఐ చంద్రమౌళి, రైల్వే అధికారులు, వైఎస్సార్ సీపీ నేతలు, స్కౌట్‌గైడ్స్ పాల్గొన్నారు.

● సత్యదేవాలో అయోధ్య రాముడి ఆలయ నమూనా



కడియపులంక కాలనీ శ్రీ సత్య దేవ నర్సరీలో మొక్కలతో ఏర్పాటు చేసిన అయోధ్యలోని శ్రీరాముడి ఆలయ నమూనా – కడియం

క్రీడల్లో రాణించాలి

ప్రకాశం నగర్ : యువత క్రీడల్లో రాణించి, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆకాంక్షించారు. ఆదివారం నగరంలోని ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో నిడ్జామ్ జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ మీట్ 2023–24ను ఎంపీ భరత్ ప్రారంభించారు. తొలుత జ్యోతి వెలిగించి క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. గాలిలోకి బెలూన్లు వదిలారు. ఎంపీ భరత్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి క్రీడలంటే ఎక్కువ ఆసక్తి అని, క్రీడలలో రాణిస్తున్న విద్యార్థులను అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. నిర్వాహకులు రాజేంద్ర, శివకుమార్, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పాల్గొన్నారు .

జిల్లాలో కొవ్వూరు సబ్ డివిజన్‌కు ఉత్తమ అవార్డు

కొవ్వూరు: జిల్లాలో 2023లో కొవ్వూరు సబ్ డివిజన్ పోలీసుశాఖ విధి నిర్వహణలో తొమ్మిది అంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి అవార్డులను దక్కించుకున్నట్టు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ తెలిపారు. ఆదివారం డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసు శాఖపరమైన విధుల నిర్వహణలో 17 అంశాల్లో ఓవరాల్ ప్రతిభలో ప్రథమ స్థానం సాధించడం గర్వంగా ఉందన్నారు. సంక్రాంతి నేపథ్యంలో ఇళ్లు విడిచి ఊళ్లు వెళ్లే వారు ఎల్‌హెచ్‌ఎం స్కీంను వినియోగించుకుని సీసీ కెమేరాలు అమర్చుకోవడం ద్వారా చోరీలకు ఆస్కారం ఉండదన్నారు. ఇళ్లు వదిలి వెళ్లే సమయంలో కచ్చితంగా ముందు ఉండే మెయిన్ గేటుకి తాళాలు వేయవద్దని సూచించారు. తాళం వేయడం మూలంగా దొంగలు చోరీకి ఎంచుకోవడం సులభ మవుతుందన్నారు. బెస్ట్ ఫెర్ఫార్మెన్స్ ఇన్ నాన్ గ్రేవ్ క్రైం(అండర్ ఇన్వెస్టిగేషన్) కేసుల సంఖ్య తగ్గించడంలో బెస్ట్ డివిజన్ అవార్డు అందుకున్నామన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ, గత ఏడాది కంటే తగ్గించడంలోను, ముందుస్తు నివారణ చర్యలు తీసుకోవడంలోను ప్రథమ స్థానం సాధించామన్నారు. ఆర్థిక నేరాలకు పాల్పడిన నిందితులను సకాలంలో పట్టుకోవడం, సొసొత్తు రికవరీ చేయడంలోను ప్రతిభ కనబరిచినందుకు సబ్ డివిజన్‌కి ప్రథమ స్థానం సాధించినందుకు మరో అవార్డు లభించిందన్నారు. బెస్ట్ ఫెర్ఫార్మన్స్ ఇన్ విజిబుల్ పోలీసింగ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నియంత్రణ, పేకాట, కోడి పందెలు నియంత్రణలో భాగంగా అధిక కేసులు నమోదు చేయడంలోను ప్రతిభ చూపినందుకు డీఎస్పీతో పాటు గోపాలపురం ఎస్‌హెచ్‌వో కర్రి సతీష్‌లకు జిల్లా ఉత్తమ అవార్డు దక్కించుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. ఉత్తమ ప్రతిభా ఇన్ మిస్సింగ్ పర్సన్స్ కేసులు సకాలంలో ఛేధించినందుకు గాను నిడదవోలు ఎస్సై పి.నాగరాజుకి ఉత్తమ అవార్డు దక్కిందన్నారు. స్పందన ఫిర్యాదులు, జగనన్నకి చెబుదాం వినతులు పరిష్కారంలో తాళ్లపూడి ఎస్సై కేవీ రమణ ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా అవార్డు దక్కించుకున్నట్టు తెలిపారు. నాన్ బెయిల్‌బుల్ వారెంట్స్ అమలు చేయడంలో కొవ్వూరు పట్టణ ఏఎస్సై జీజీ ప్రకాశరావు, పెరవలి హెచ్‌సీ కె.శ్రీహరి, నిడదవోలులో ఏఎస్సై డి.కోటేశ్వర రావులు ఉత్తమ అవార్డులు దక్కించుకున్నారన్నారు. రక్షించి విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు నిడదవోలు సీఐ కె.వెంకటేశ్వరరావుకి ఉత్తమ అవార్డు దక్కించుకున్నా రని తెలిపారు. బైండోవర్ కేసులు నమోదులో నిడదవోలు ఎస్సై పి.నాగరాజు జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారన్నారు.

వైఎస్సార్ సీపీలో 50 మంది చేరిక


నాగేశ్వర్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరిన హనీ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు

ధవళేశ్వరం: హనీ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో 50మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ కో–ఆర్డినేటర్, రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక ఎర్రకొండ వడ్డెర వీధిలో జరిగిన కార్యక్రమంలో వీరు పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంక్షేమ పాలన చూసి వైఎస్సార్ సీపీకి ఆకర్షితులయ్యామని హనీ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా అన్న, వస్త్రదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం హనీ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు చందన నాగేశ్వర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు తాటికొండ విష్ణుమూర్తి, కొప్పినీడి ప్రసాద్ బాబు(రాజమౌళి), ఎల్‌వీ ప్రసాదరావు, ప్రభు అంబేడ్కర్ (హనీ), రవీంద్ర, అనీల్ సురేష్ ,తలారి ప్రసాద్ పాల్గొన్నారు.

కోటసత్తెమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెం గ్రామంలో ఉన్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. 2023 ఏడాది ముగింపు సందర్భంగా ఎక్కువ మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోలు అమ్మకంతో రూ.81,253 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం (శివ) పేర్కొన్నారు. ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయసిబ్బంది ఆలయంలో సేవలందించారు.

మార్కెట్‌కు న్యూ ఇయర్ జోష్


ప్రత్యేక ఆఫర్లు ప్రకటించిన ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు


అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఫ్లవర్ బొకేలు

ప్రకాశం నగర్ : 2023 సంవత్సరానికి వీడ్కోలు పలికి, 2024 కొత్త ఏడాదికి ఘన స్వాగతం పలికేందుకు నగరవాసులు సమాయత్తమయ్యారు. దీంతో ఆదివారం సాయంత్రం నుంచి నగరంలో ఎటు చూసినా న్యూ ఇయర్ సందడి నెలకొని ఉంది. న్యూ ఇయర్ వేడుకలను ఉత్సాహంగా జరుపుకునేందుకు అవసరమైన స్వీట్లు ,కేక్‌లు కొనుగోలు చేసేందుకు నగరవాసులు అసక్తి చూపడంతో నగరంలోని బేకరీలు, స్వీట్ స్టాల్స్, ఫ్లవర్ బొకే షాపులు జనంతో కిటకిటలాడాయి. బేకరీ యజమానులు రకారకాల కేక్‌లను తయారు చేసి విక్రయాలకు సిద్ధం చేశారు. వీటితోపాటు ఆయా ప్రధాన రాజకీయ పార్టీల జెండా రంగుల్లో ఉండే కేక్‌లను కూడా తయారు చేసి విక్రయాలకు సిద్ధంగా ఉంచారు.


రంగులను కొంటున్న మహిళలు

ప్రత్యేక ఆఫర్లు

న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా నగరంలోని ప్రధాన హోటళ్లు విద్యుత్ కాంతులు విరజిమ్మాయి. డీజే సౌండ్ సిస్టంలు వంటి ఏర్పాటు చేశారు. హోటల్స్‌లో డిన్నర్‌కి సింగిల్స్‌కి ఒక్క రేట్, కపుల్స్‌కి ఒక్క రేట్ అంటూ వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లు ప్రకటించారు. రెస్టారెంట్‌లు, బిర్యానీ సెంటర్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు కూడా ప్రత్యేక ఆఫర్లు ప్రకటించాయి. చికెన్, మటన్, బిర్యానీ ఒకటి కొంటే ఒకటి ఫ్రీ, బిర్యానీ ప్యాకెట్‌కు డ్రింక్ బాటిల్ ఫ్రీ వంటి ఆఫర్లను ప్రకటించడంతో యువత ఫాస్ట్ ఫుడ్ సెంటర్లకు క్యూ కట్టారు.

రంగుల హరివిల్లు

ప్రతి ఇంటి ముందు రంగులతో నూతన సంవత్సర శుభాకాంక్షలు అనే ముగ్గులు వేసి మురిసిపోయే మహిళలు వివిధ రకాల రంగులను కొనుగోలు చేశారు. తమ ఇంటి ముందు వేసే ముగ్గు పెద్దదిగా ఉండాలని, అందరి కంటే అందమైన ముగ్గు వేయాలని ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. దీంతో ఎక్కడికక్కడ షాపులను ఏర్పాటు చేసి రంగులను విక్రయిస్తున్నారు.

నిడదవోలు సీఐకి లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డు

నిడదవోలు: పట్టణంలోని తీరుగూడెంలో తేనెటీగల దాడి నుంచి ముగ్గురు చిన్నారులను ప్రాణాలకు తెగించి కాపాడినందుకు నిడదవోలు సీఐ కె.వెంకటేశ్వరరావుకి లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డు దక్కింది. ఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఎస్పీ జగదీష్ నుంచి అవార్డు అందుకున్నారు. 2023లో మిస్సింగ్ కేసులను ఛేదించడం , శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా బైండోవర్ పెట్టడంలోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నిడదవోలు పట్టణ ఎస్సై పి.నాగరాజుకి ప్రతిభా అవార్డును జిల్లా ఎస్పీ జగదీష్ అందించారు. అదేవిధంగా క్రిమినల్ కేసుల్లో నిందితులు కోర్టుకు హాజరవకుండా తప్పించుకుని తిరుగుతున్న నిందితులను పట్టుకుని కోర్టులో హాజరుపరచడంలో ప్రతిభ కనబరిచిన ఏఎస్సై డి.కోటేశ్వరరావు, పీసీ పి.శ్రీనివాస్ కూడా అవార్డులు అందుకున్నారు.

4 నుంచి సామాజిక పింఛన్ల పంపిణీ

బిక్కవోలు: మండలంలో జనవరి 4 నుంచి సామాజిక పింఛన్ల పంపిణీ ఉంటుందని ఎంపీడీఓ జేఏ ఝాన్సీ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ జనవరి నుంచి రూ.2,750 నుంచి రూ.3 వేలు పెరగడంతో పాటు నూతన పింఛన్లు మంజూరైనట్టు చెప్పారు. కాకినాడలో సీఎం పింఛను పంపిణీ కార్యక్రమం అనంతరం మండలంలోని మొదలవుతుందన్నారు. ఇది 8వ తేదీ వరకూ ఉంటుందన్నారు. ఈ విషయాన్ని వలంటీర్లు లబ్ధిదారులకు తెలియజేయాలని సూచించారు.

పంట పండినట్టే..!

- ఈ–క్రాప్ నమోదుతో రైతులకు ఎంతో మేలు
- రబీ సీజన్ ప్రారంభంతో తప్పనిసరి
- అనపర్తి నియోజకవర్గంలో 44,821 ఎకరాల్లో వరి సాగు
- ఇందులో పది శాతం పూర్తి


దోమాడలో రైతుకు ఈ–క్రాప్ నమోదు చేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకుడు. పర్యవేక్షిస్తున్న ఏఓ మణిదీప్

పెదపూడి: భూమి దున్నడం చేపట్టినప్పటి నుంచి రైతు కష్టాలు మొదలైనట్టే. విత్తనం నాటిన మొదలు.. పంట చేతికి దక్కేవరకూ దిగులే. ఈ మధ్యన ఏ కష్టం ముంచుకొస్తుందోనన్న ఆందోళన అన్నదాతను వెంటాడుతూనే ఉంటుంది. వీటన్నింటినీ అధిగమించి.. నేనున్నానంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇస్తున్నారు. ఈ–క్రాప్ ప్రక్రియతో రైతు పండించే ప్రతి గింజకూ బీమా ధీమా కల్పిస్తున్నారు. ఈ–క్రాప్‌తో మరెన్నో ప్రయోజనాలను రైతుకు కట్టబెడుతున్నారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగానికి, రైతుల సంక్షేమానికి తొలి ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీల అమలు దిశగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ–క్రాప్ నమోదు విధానం రైతులకు వరంగా మారుతోంది. ఆరుగాలం శ్రమించే రైతులకు ఇదెంతో మేలు కానుంది. రబీ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో.. వరి నాట్లు వేయడం, వెదజల్లు విధానాల్లో రైతులు సాగు చేపట్టారు. రైతు విత్తనం విత్తిన నాటి నుంచి పంట కోసి విక్రయించే ప్రక్రియ మొత్తం ఈ–క్రాప్ నమోదు చేయాల్సి ఉండటంతో ఆయా మండలాల్లో ఈ ప్రక్రియను వ్యవసాయ శాఖాధికారులు చేపట్టారు.

అనపర్తి నియోజకవర్గంలో..

అనపర్తి నియోజకవర్గంలో మొత్తం నాలుగు మండలాల్లో ఈ రబీ సీజన్‌లో 44,821 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. అనపర్తిలో 9 వేలు, పెదపూడిలో 18 వేలు, రంగంపేటలో 2,100, బిక్కవోలులో 15,741 ఎకరాలల్లో సాగు చేపట్టారు. ఆయా మండలాల్లో సుమారు పది శాతం మేర ఈ–క్రాప్ నమోదు పూర్తయింది.

ఈ–క్రాప్ నమోదుతో ప్రయోజనాలు

రైతులు తమ పంటను ఈ–క్రాప్ నమోదు చేయడంతో బీమా వర్తింపు, నష్ట పరిహారం చెల్లించడం, గిట్టుబాటు ధర కల్పించడం, సున్నా వడ్డీ అమలు, పంట, బ్యాంకు రుణాలు, ఎరువులు, పురుగు మందుల సరఫరా, వైఎస్సార్ యంత్ర పరికరం నమోదు, పెట్టుబడి సాయం, ఉచిత బోర్ల మంజూరు సులభతరమవుతాయి. ఈ–క్రాప్‌లో భాగంగా రైతు భరోసా కేంద్రంలో ప్రతి రైతు భూమి వివరాలు, గ్రామం, సర్వే నంబర్, ఆధార్ వివరాలు నమోదు చేస్తున్నారు. దీంతో పంట విక్రయించే సమయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ తప్పుతుంది. కౌలు రైతులు తమ పేర్లను ఆయా గ్రామాల్లోని ఆర్‌బీకేల్లో నమోదు చేయించుకోవాలి. ఆయా ప్రాంతాల్లో పంటలు పండించే వివరాలు, వ్యవసాయ శాఖ గ్రామ స్థాయి అసిస్టెంట్లు ఈ–క్రాప్ చేసి, ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు.

రైతులకు వరం, ఎంతో మేలు



ఈ–క్రాప్ నుంచి రైతులకు గతంతో పోల్చితే ఎన్నో రెట్లు మేలు జరుగుతోంది. ప్రతి రైతు పండిస్తున్న పంటను నమోదు చేయించాలి. రబీ సీజన్ ప్రారంభమైనందున తప్పనిసరిగా ఈ–క్రాప్ చేయించాల్సి ఉంది. ఈ–క్రాప్ వేగవంతం చేసి, మండలంలో త్వరిత గతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మండలంలో సుమారు 18 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. జి.మామిడాడ, పెదపూడి, పెద్దాడ, దోమాడ గ్రామాల్లో ఈ–క్రాప్ ప్రక్రియ జరుగుతోంది.

– టీవీఆర్ మణిదీప్, ఎంఏఓ, పెదపూడి

రద్దీగా పలావ్ సెంటర్లు


సీతానగరం బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పలావ్ సెంటర్ల వద్ద రద్దీ

సీతానగరం: న్యూయర్ సందర్భంగా మండలంలోని పలు గ్రామాలలో పలావ్ సెంటర్ల వద్ద ఆదివారం రద్దీ ఎక్కువైంది. నూతన ఆంగ్ల సంవత్సరాన్ని ఆహ్వానించేందుకు ఆదివారం జనం సిద్ధమయ్యారు. పలావ్ సెంటర్ల వద్ద నోరూరించే మాంసాహారం వంటల అమ్మకాలు జరిపారు. సాయంత్రం 4 గంటలకే పలు గ్రామాలలో పలావ్ దుకాణాలు వెలిశాయి. అలాగే పండ్ల ధరలు ఆకాశాన్ని అంటాయి. ఒక్కో యాపిల్ రూ.70కి అమ్మకాలు జరిపారు. పురుషోత్తపట్నం ఏటిగట్టుపైన, రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, సీతానగరం నాలుగు బొమ్మల సెంటర్, బస్టాండ్ సెంటర్, రఘుదేవపురం సెంటర్, ముగ్గళ్ళ, ఇనుగంటివారిపేట, వెదుళ్ళపల్లి, మునికూడలి, కాటవరం, బొబ్బిల్లంకలలో టెంట్‌లు వేసి ఏర్పాటు చేసిన పలావ్ దుకాణాలలో ఘుమ, ఘుమలాడే వివిధ రకాలైన మాంసాహార వంటకాలను విక్రయించారు. నోరూరించే వివిధ రకాలైన చికెన్, మటన్‌లలో పలు రకాల వంటకాలు, రొయ్య, పీతలు, బొమ్మిడాల పులుసు వంటి పలు రకాల వంటకాలు అమ్మకాలు జరిపారు. పలావ్ ప్యాకెట్ ధర రూ.50 నుంచి రూ.150 వరకు పలు ఆఫర్‌లతో అమ్మకాలు జరిపారు. రెండు పలావ్ ప్యాకెట్లు కొంటే ఒక ప్యాకెట్ ఉచితం, పలావ్ ప్యాకెట్‌తో పాటుగా డ్రింక్ బాటిల్ ఉచితం వంటి ఆఫర్లతో కొనుగోలుదారులను ఆకట్టుకున్నారు. మద్యం దుకాణాల వద్ద జనం అధిక సంఖ్యలో గుమిగూడి కొనుగోలు చేశారు. పలావ్ దుకాణాల వద్ద ఒకటి, రెండు లీటర్ల కూల్‌డ్రింక్స్ బాటిళ్లను ఆఫర్‌గా ఉంచారు. కొన్ని పలావ్ దుకాణాల వద్ద వాటర్ బాటిల్ ఉచితంగా అందించారు. స్థానిక ఎస్సై కె.చిరంజీవి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు చేపట్టారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు చంద్రన్న

రంగంపేట: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అనపర్తి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ శివరామకృష్ణంరాజు అన్నారు. ఈలకొలను గ్రామంలో ఆదివారం సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ అధ్యక్షతన వికసిత భారత్ సంకల్ప యాత్ర జరిగింది. ముఖ్యఅతిథి శివరామకృష్ణంరాజు మాట్లాడుతూ 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఉండాలనేది ప్రధాని సంకల్పమన్నారు. పథకాలు అర్హులైన పేదలకు చేర్చడమే కేంద్రం ముఖ్యోద్దేశమన్నారు. అనంతరం జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న బీజేపీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. వివిధ పథకాలను, గ్యాస్ కనెక్షన్లను లబ్ధిదారులకు అందించారు. పార్టీ నాయకులు సాయిరాం, ప్రసాద్, సురేష్ పాల్గొన్నారు.

కనకదుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే జక్కంపూడి

మధురపూడి: కోరుకొండ మండలం మధురపూడిలోని కనకదుర్గమ్మ అమ్మవారిని ఆదివారం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రాజానగరం నియోజకవర్గంలోని ప్రజలను కాచి, కాపాడాలని కోరుకున్నారు. స్థానికులతో కొద్దిసేపు మాట్లాడారు. బీజేపీ రాజానగరం నియోజకవర్గం కన్వీనర్ నీరుకొండ వీరన్నచౌదరి, టీడీపీ నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం


బాధిత కుటుంబ సభ్యులకు గణేష్ పంపించిన ఆర్థిక సహాయం అందిస్తున్న దృశ్యం

సీతానగరం: మండలంలోని నాగంపల్లికి చెందిన అల్లంపల్లి ధర్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా బాధిత కుటుంబానికి ఉమ్మడి గోదావరి జిల్లాల వైఎస్సార్ సీపి యువజన విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ ఆర్థిక సహాయం అందించారు. ఆదివారం జక్కంపూడి గణేష్ బాధితులకు రూ.10 వేలు పంపించగా సర్పంచ్ దోశపాటి వీరచంద్రం చేతుల మీదుగా అందించారు. ధర్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా జక్కంపూడి గణేష్ రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. ఆరోగ్య పరిస్థితి విషమించి ఈ నెల 28న మరణించాడు. సమాచారం అందుకున్న జక్కంపూడి గణేష్ తక్షణమే వైఎస్సార్ బీమా పథకం నగదు అందించే ఏర్పాటు చేశారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. వీటిని సర్పంచ్ వీరచంద్రం చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ నుంచి టీడీపీలోకి వలసలు

పెదపూడి: రామేశ్వరం గ్రామంలో ఆదివారం సాయంత్రం జనసేన పార్టీ నుంచి కొంత మంది టీడీపీలోకి చేరారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన పార్టీలు కలిసి పోటీ చేస్తున్న నేపథ్యంలో, జనసేన నుంచి టీడీపీలోకి వలస వెళ్లడంపై అంతా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీలో చేరిన 12 మంది జనసేన నాయకులు గత ఎంపీటీసీ ఎన్నికల సమయంలో.. ఆ పార్టీ నియోజకవర్గ నేతతో పార్టీ కండువాలు వేయించుకున్నారు. అనంతరం ఎన్నికల ప్రచారం చేశారు. అలాగే జనసేన చేపట్టే కార్యక్రమాల్లో పాల్గొని, ఆ పార్టీ అధినేత పుట్టిన రోజు, పార్టీ నాయకుల పుట్టిన రోజు వేడుకలు కూడా నిర్వహించారు. తామంతా జనసేనకు కట్టుబడి పని చేస్తున్నామంటూ చెప్పి, తుదకు టీడీపీలో చేరారంటూ విమర్శలు వినిస్తున్నాయి. జనసేన నుంచి తెలుగుదేశం పార్టీలోకి చేరికలు ఏంటా అంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు.

గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలు



పందలపాకలో ఓ ఇంటి ముందు వేసిన ముగ్గు

బిక్కవోలు: నూతన సంవత్సరం సందర్భంగా మండలంలోని గ్రామాల్లో ఆదివారం సందడి వాతావరణం నెలకొంది. యువకులు బిర్యానీ సెంటర్ల వద్ద కిటకిటలాడారు. మహిళలు రంగవల్లులతో వీధులను అందంగా ముస్తాబు చేశారు. పాత సంవత్సరానికి ముగింపు పలుకుతూ, నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఆనందంగా గడిపారు.


పందలపాకలో బిర్యానీ షాపు వద్ద యువకులు

నేడు మహాన్న సమారాధన

బిక్కవోలు: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని పందలపాక గ్రామం సరిపల్లి పేటలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద మహాన్న సమారాధన నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి అన్న సమారాధన జరుగుతుందని చెప్పారు.